

తుపాను సహాయక చర్యలు చేపట్టండి
కలెక్టర్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను, ఆవాసాలు దెబ్బతిన్న ప్రజలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా కోరారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా నిత్యావసరాలు పంపిణీ చేయాలని కోరారు. వరి కోతల సమయంలో తుపాను మంచుకురావడం వల్ల జిల్లాలోని నగరి, విజయపురం, నింద్ర, కార్వేటినగరం మండలాల్లోని రైతాంగం తీవ్రఆందోళన చెందుతున్నారని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ఎలాంటి నష్టం జరకుండా చూడాలన్నారు. సిపిఎం నుండీ నాయకులు, కార్యకర్తలు వాలంటీర్లు ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ముంచేస్తున్న 'మిచౌంగ్'



వీడని వాన - వణికిస్తున్న చలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో చిత్తూరు జిల్లా చికురుటాకులా వణికిపోతోంది. ఈ తుపాను ప్రభావం చిత్తూరు జిల్లాలోని నగరి, విజయపురం, కార్వేటినగరం, నింద్ర మండలపై తీవ్రప్రభావం చూపుతోంది. గంటలకు 90 నుంచి 100కి.మి వేగంతో గాలులు వీస్తున్నాయి. మరో రెండు రోజులు పాటు తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాగం అప్రమత్తమైంది. ఎడతెరిపిలేని వర్షంతో జిల్లాలో 30శాతం చెరువులు వర్షపు నీటితో నిండుకుండలను తలపిస్తున్నారు. వాగులు, వంగలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షాపు నీరు చేరింది. జిల్లా కలెక్టరేట్ ఆదేశాల మేరకు రెవిన్యూ, వ్యవసాయశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం చోటు చేసుకోకుండా సహాయ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా టమోట, వరి, కంది, పెసర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. తుపాను ప్రభావం తగ్గిన తరువాత పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు వ్యవసాయశాఖ తెలిపారు. ఇదిలా ఉండగా ఎన్‌టిఆర్ జలాశయం పూర్తిస్థాయిలో నీరు నిండడంతో గేట్లు ఎత్తి నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు.

వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

మిచౌంగ్ తుపాను ప్రభావంతో సోమవారం చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 432.8 ఎం.ఎం నమోదైయింది. అత్యధికంగా నింద్ర మండలం 90.4, అత్యల్పంగా బంగారుపాళ్యం 0.4 మిల్లీమీటర్లు నమోదు కాగా, విజయపురం 56,4, నగరి 44.4, కార్వేటినగరం 36.4, ఎస్‌ఆర్‌పురం 27.2, వెదురుకుప్పం 24.6, పెనుమూరు 23.2, జీడి నెల్లూరు 20.0, పులిచర్ల 10.6, గుడిపాల 10.4, చిత్తూరు 10.0, సోమల 6.4, సదుం 4.2, యాదమరి 4.0, చౌడేపల్లి 3.2, తవణంపల్లి 2.4, పెద్ద పంజాణి 2.2, ఐరాల 1.0, గంగవరం 1.0, పలమనేరు 1.0 బంగారుపాళ్యం 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం జరిగింది.

సహాయక చర్యలు ముమ్మరం చేయండి


వీడియో కాన్ఫెరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్, ఎస్పీ

చిత్తూరుఅర్బన్: మిచౌంగ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి తుపాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్.ముఖ్యమంత్రి మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల, ఎన్టీఆర్ కష్ణ పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలలో మిచౌంగ్ తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరుగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో పాటు ఇతర అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని సహాయకచర్యలు చేపట్టాలని, ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. చెరువులు, వంకలు, వాగుల వద్ద భద్రత పెంచాలని, ఉధతంగా ప్రవహిస్తున్న నీటిప్రవాహాలను ప్రజలు దాటకుండా చూడాలన్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే రైతులకు జరిగిన పంటనష్టం అంచనా మొదలు పెట్టాలన్నారు. సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని, పునరావాస కేంద్రాలలో నాణ్యమైన ఆహారంతో పాటు, కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల నుండి వెళ్ళే వారికి ఒక వ్యక్తికి రూ.1,000లు, ఒక కుటుంబానికి గరిష్టంగా రూ.2,500లు అందించాలన్నారు. ఇల్లు కోల్పోయిన వారికి తక్షణ సహాయం కింద రూ.10 వేలు, 25 కేజీల బియ్యం, ఒక కిలో కందిపప్పు, పామాయిల్ ఇతర కూరగాయలు ఇచ్చి వారిని ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వం తరపున అందించే పరిహారం సంఘటన జరిగిన 48 గంటలలోపు వారికి చేరే విధంగా చూడాలన్నారు. చిత్తూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి నిరంజన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురలీకష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, జిల్లా ఫైర్ అధికారి పెద్దిరెడ్డి, ఎస్ఈ ఏపీ ట్రాన్స్కో శ్రీహరి, రోడ్లు భవనాలశాఖ అధికారి మదన్మోహన్‌రెడ్డి, ఎస్ఈ పంచాయతీరాజ్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ పంచాయతీరాజ్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేందద్రావు, గ్రామీణ నీటి సరఫరా అధికారి శంకర్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ అరుణ, డిఎంహెచ్ఓ ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో మిచౌంగ్ తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున, కలెక్టర్ షన్మోహన్ ఆదేశాల మేరకు జడ్పీ ఛైర్మన్ సూచనల మేరకు జెడ్‌పి కార్యాలయంలో తుపాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైందని జిల్లా పరిషత్ సిఈఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు, కంట్రోల్ రూమ్ 24×7 గంటలు పని చేస్తుందని, ఎంపిడిఓలు కూడా మండలస్థాయిలో తుపాన్ కంట్రోల్ రూమ్‌లు వెంటనే ఏర్పాటుచేసి, 24×7 గంటలు పని చేయాలని జడ్పీ సీఈఓ తెలిపారు, జడ్పీ ఆఫీస్, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08572 222817 జిల్లాలోని అందరు మండలస్థాయి అధికారులు తుపాన్‌కు సంబంధించిన సమాచారంను, తుపాన్ వల్ల సంభవించే ప్రమాదాలు, నష్టాలను వెంటనే జడ్పీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన తుపాన్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని అన్నారు.

నిండుకుండలా కృష్ణాపురం జలాశయం


వర్షపు నీటితో కలకళలాడుతున్న కృష్ణాపురం జలాశయం

కార్వేటినగరం: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కష్ణాపురం జలాశయం నీటితో నిండి కలకళలాడుతుంది. దీంతో అప్రమత్తమైన అధికారులు జలాశయం వద్ద పర్యవేక్షణ చర్యలు చేపట్టినట్లు ఇరిగేషన్ రవీంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి 100 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 128 ఎంసీఎఫ్‌టీ నీరు చేరిందని, తుపాన్ ప్రభావం ఇలాగే కొనసాగితే త్వరలో పూర్తిస్థాయిలో జలాశయం నిండే అవకాశం ఉందని పేర్కొన్నారు. జలాశయాన్ని సందర్శించేందుకు యాత్రికలు ఎవ్వరూ రాకూడని సూచించారు. గంటగంటకు పెరుగుతున్న నీటి మట్టాన్ని పరిశీలించి మంగళవారం గేట్లు ఎత్తే అవకాశం ఉంటుందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి: సిఐ

కార్వేటినగరం: మిచౌంగ్ తుపాన్ ప్రభావం వలన కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం సిఐ సత్యబాబు తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ 6వ తేదీ వరకు మూడు రోజులు పాటు ఎడతెరపి లేకుండా మోస్తారు నుంచి భారీ వర్షాలు జిల్లాలో కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు వాగులు, వంకలు దాటే సాహసాలు చేయకూడదన్నారు. అలాగే చెరువుల వద్దకు వెళ్లకుండా చూడాలని సూచించారు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసేందుకు 1గంట ముందే సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా జన సంచారం తగ్గుముఖం పట్టాకు రాత్రి సమయంలోనే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని చెప్పారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. లోతట్టు గ్రామాల్లో ఉన్న ప్రజలు కూడా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు.

తుపాన్ నేపథ్యంలో
ఇండ్ల నుంచి బయటకి రాకండి : కలెక్టర్

- జిల్లాలో ఎలాంటి నష్టం జరగలేదు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



జిల్లాలో మిచౌంగ్ తుపాన్ వల్ల ఇప్పటివరకు ఎలాంటి నష్టం జరగలేదని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాలో మిచౌంగ్ తుపాన్ వల్ల ఎలాంటి నష్టం జరగలేదన్నారు. చిత్తూరు జిల్లా పరంగా తుపానుకు సంబంధించి మొత్తం కంప్లీట్‌గా అడ్మినిస్ట్రేషన్ సంబంధించి రెవెన్యూ, పోలీస్, పౌర సరాఫరాల శాఖ వైపు నుంచి చేయవలసిన అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించడం జరిగిందని, మండలస్థాయి అధికారులతో పాటు రెవెన్యూ సిబ్బంది అందురు ఫిల్డ్‌పై అందుబాటులో ఉండాలన్నారు. ఏదైనా నష్టం జరిగితే వెంటనే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్లు 9491077356 – 08572 242777. ఇప్పటివరకు జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. వర్షం 50 నుండి 55 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు జరిగిందని, నగరి నియోజకవర్గంలో రోడ్లపైకి నీరు రావడం జరిగింది తప్ప, రోడ్లు గాని పంట పొలాలు గాని నష్టం జరగలేదని తెలిపారు. పౌరసరాఫరా శాఖ ద్వారా 1వ తేదీని రేషన్ స్టాక్ పోయింట్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి, ప్రజలకు రేషన్ అందజేయుటకు సిద్ధంగా ఉందని తెలిపారు. నగిరి నియోజకవర్గానికి సంబంధించి నగిరి, నగరి మున్సిపాలిటీ, నింద్ర, విజయపురం, కార్వేటి నగర్ మండలాలలో పాఠశాలలకు సెలవు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన చోట్ల ఎలాంటి ఇబ్బందులు లేవని,ప్రజలు వర్షంలో వాగులు, వంకలు వద్దకు వెళ్లరాదని ప్రజలకు సూచించారు.

వణికిస్తున్న మిచౌంగ్
లోతట్టు ప్రాంతాలు జలమయం


నగరిపేట లోతట్టు ప్రాంతంలోని నివాసాల చుట్టూ చేరిన వర్షపు నీరు

నగరి: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా మూడురోజులుగా వర్షం కురుస్తోంది. ఇప్పటివరకు కురిసిన వర్షపాతం 166 మిల్లీమీటర్లుగా నమోదైంది. వర్షపు నీటికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు నిండి మొరవపోతున్నాయి. కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. పలు ప్రాంతాల్లో గృహాలతో పాటు దుకాణాల్లోను వర్షపు నీరు ఉరిసే పరిస్థితి ఎదురైంది. వర్షానికి తోడు చలిగాలులతో ఇంటి నుంచి అడుగు బయటపెడితే వణుకు పుడుతోంది. నగరిపేటలో లోతట్టు ప్రాంతంలోని నివాసాల చుట్టూ వర్షపు నీరు చేరింది. స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు పక్కనే ఉన్న గుంట నిండి ప్రవహించడంతో కోర్టు ఆవరణ జలమయమైంది. మండలంలోని కృష్ణారామాపురం వద్ద రోడ్డుపై భారీ వృక్షం కూలిపడింది. సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాకపోకలు స్తంభించడంతో అధికారులు అతికష్టం మీద చెట్టును తొలగించి రాకపోకల సౌకర్యం కల్పించారు. సత్రవాడ ఎస్టీకాలనీలో నివాసాలకు సమీపం ఉన్న గుట్టనీటికి కరుగుతూ పైనుంచి రాతిగుండు దొర్లిపడటంతో సుబ్బమ్మ అనే మహిళకు చెందిన ఇంటిగోడ పాక్షికంగా కూలింది. మండలంలో 7 నివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సంఘటనా స్థలాలకు చేరుకున్న రెవెన్యూ అధికారులు పరిస్థితిని తెలుసుకొని వారికి సహాయక చర్యలు చేపట్టారు. వేలావడి ఎస్టీకాలనీకి చుట్టూ నీరు చేరడంతో రాకపోకలు స్తంభించింది. వారికి సహాయక చర్యలను తహసీల్దార్, ఆర్డీవో కలెక్టర్‌తో సంప్రదించి చేపట్టారు. పాండురాజపురం వద్ద రోడ్డుపక్కనే ఉన్న చేసులో వేసి ఉన్న బోరుపైపు నుంచి నీటిని పైకి చిమ్మింది.


కృష్ణారామాపురం వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

అవగాహన తప్పనిసరి : కలెక్టర్

ఈవీఎం, వీవీప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సి.షన్మోహన్ అన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌ల అవగాహన ప్రదర్శన కేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఓటువేసే విధానంపై అవగాహన కల్పించేందుకు అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఓటు వేసే విధానంను వివరిస్తారని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి, వారికి ఉన్న సందేహాలను నివత్తి చేయనున్నట్లు చెప్పారు. ఈఅవగాహన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని తెలిపారు. ఓటు వేసే విధానంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కుఓటు అని తెలిపారు. కలెక్టరేట్‌కు విచ్చేసే ప్రజలకు ఓటు వేసే విధానం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఈవీఎం, వీవీప్యాట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఉత్తమ సేవలకు సేవాపురస్కారాలు


ఆరోగ్యశ్రీ సిబ్బందికి సేవాపురస్కారం అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉత్తమసేవలు అందించిన ఆరోగ్య మిత్రలకు ఆరోగ్య సేవాపురస్కారంను జిల్లా కలెక్టర్ షన్మోహన్ సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతి దేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డితో కలసి ఎస్‌వి.రాణెమ్మ, జి.సరితలకు ఆరోగ్య సేవా పురస్కారాలను అందించారు. వీరు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా నిరంతరం వైద్య కోసం వచ్చే ఆరోగ్య శ్రీ లబ్ధిదారులకు ఆరోగ్యమిత్రగా అందించే సేవలు మరువలేనివని కలెక్టర్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల అమలులో మీపాత్ర చాలా విలువైనదని, సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పురస్కారంతో పాటు రూ.5వేలు చెక్కును జిల్లా కలెక్టర్ వారికి అందజేశారు.

పంటలను కాపాడుకుందాం

వ్యవసాయశాఖ సూచనలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మిచౌంగ్ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రస్తుతం రైతుల పొలాలలో ఉన్న వివిధ పంటలకు సంబంధించి ఈ జాగ్రత్తలు, సత్వర చర్యలను గురించి రైతాంగానికి జిల్లా వ్యవసాయశాఖ కొన్ని సూనలు చేసింది. పంటను నష్టపోకుండా రైతులు కొన్ని రకాల సూచనలు పాటించాలని వ్యవసాయశాఖ జేడి మురళి కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

తుపాన్ సమయంలో పంట కోత కోయకండి..

వర్షపునీరు పొలంలో నిలవకుండా బయటికి వెళ్ళడానికి కాలువలు తీసి, నిలిచిన వర్షపు నీటిని బయటికి పోయే విధంగా చర్యలు చూసుకోవాలి. కాలిబాటలు ద్వారా పొలంలో నిలిచిన వర్షపునీటిని బయటికి పంపించాలి. వరి పంట పాలు పోసుకునే దశలో ఉండి 2 నుండి 3రోజులు తడిస్తే గింజ గట్టిపడదు, గింజ నాణ్యత, రంగుమారే అవకాశం వుంది. గింజ రంగు మారితే అమ్మకం ధర కూడా తగ్గిపోతుంది. అలాంటప్పుడు కార్బెండిజం 1 గ్రామము, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి లేదా ప్రోపికొనజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవడం వలన గింజ రంగు మారడం తగ్గించవచ్చు. వరి పంట కోతకు దగ్గర స్టేజ్‌లో వున్నప్పుడు కంకుల బరువుకి చిన్న గాలికి కూడా నేల మీద పడిపోయే అవకాశం ఉంది. అలా నేల మీద పడిపోతే కోత కోయడానికి కూలీ ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. కాబట్టి నేలమీద పడిపోయిన వరి పనలను దుబ్బులుగా కట్టుకోవడం వలన నష్టాన్ని తగ్గించుకోవచ్చు. కోసిన వరి పంట పనలు చేనులో వుండే పరిస్థితుల్లో తక్షణమే పనలను కట్టలుగా కట్టి కుప్పలుగా వేసి వర్షానికి తడవకుండా తార్పాలిన్ పట్టలతో కప్పి జాగ్రత్త తీసుకోవాలి. వేసిన కుప్పలు తడిచిపోతే ఎకరా పంటకు 25 కేజీల ఉప్పు ద్రావణాన్ని కుప్పలపైన పిచికారీ చేయడం వలన నష్టాన్ని తగ్గించుకోవచ్చు. ఒకవేళ చేనులో వున్న వరి పనలు వర్షానికి నీటిలో తడిచిపోతే వెంటనే వరి పనలను పొలంలో నుండి పొలం గట్టు మీద ఉంచాలి. తరువాత 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనల మీద, కంకుల మీద పిచికారీ చేసుకున్నట్లయితే గింజలు మొలక రావడాన్ని అరికట్టవచ్చు.

వర్షం ఆగిన తరువాత పనాలను ఆరబెట్టి, పంటను నూర్చుకోవాలి. వరి పనలు వారం రోజులు వర్షపు నీటిలో తడిస్తే గింజలు నిద్రావస్థ నుండి బయటకు వచ్చి మొలక రావడానికి అవకాశం వుంది. దీనికి 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపైన పిచికారీ చేసి తగ్గించవచ్చు. రబీ వరి నారుమడి దశలో వుండి అధిక వర్షాల వలన 5 రోజులు మునిగిపోయి వుంటే, వెంటనే నారుమడిలో నిలిచిపోయిన నీటిని నారుమడి నుండి బయటకు తీసివేసి, వర్షం తగ్గిన వెంటనే 1కేజీ యూరియా మరియు 1కేజీ పొటాష్ 5సెంట్ల నారుమడికి వేయడం వలన క్రొత్త ఆకులు వచ్చి నారుమడి ఆరోగ్యంగా పెరుగుతుంది.వరి చిరుపొట్ట దశలో వుంటే అధికవర్షం వలన నిలిచిన నీటిని బయటకు వదిలేసి, 20 కేజీల యూరియాం20 కేజీల పొటాష్ పైపాటుగా వేసుకోవాలి.వర్షాలు ఆగిన తరువాత కార్బెండిజమ్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

కంది పంటను కాపాడుకోవడం ఇలా..

ముందుగా అధికంగా నిలిచిన వర్షపు నీటిని పొలం నుండి బయటకు తీసేయాలి. ఒక శాతం 19-19-19 కానీ పొటాషియం నైట్రేట్ (కెఎన్-3) ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. వర్షాలు ఆగిన వారం తరువాత మారూకా మచ్చల పురుగు పంటను ఆశించే అవకాశం ఉన్నందువలన క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ లేదా నోవాల్యురాన్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

మినుము, పెసలు పంటలు

ముందుగా అధికంగా నిలిచిన వర్షపు నీటిని పొలం నుండి బయటకు తీసేయాలి. పంట పెరిగే దశ, కాయలు ఏర్పడే దశలో వుంటే అధిక వర్షాల వలన ఇనుము ధాతు లోపం గుర్తించవచ్చు. దానికి ఫెర్రస్ సల్ఫేట్ (అన్నభేది) 5గ్రాములు, సిట్రిక్ ఆమ్లం 5 గ్రాములు, యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం వలన ఇనుము ధాతు లోపాన్ని తగ్గించుకోవచ్చు. ఒక వారం తరువాత 19-19-19 లేదా పొటాషియం నైట్రేట్ (కెయన్ 3) 1శాతం ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. వేరుకుళ్ళు, మచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వర్షాలు ఆగిన వారం తరువాత మారుకా మచ్చల పురుగుపంటను ఆశించే అవకాశం ఉన్నందువలన క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ లేదా నోవాల్యురాన్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మిచౌంగ్ తుపాన్ సమయంలో, తుపాన్ తరువాత రైతులపై జాగ్రత్తలు పాటించి కలగబోయే నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారులు ఆర్‌బికె ఇన్‌ఛార్జులు జిల్లాలకు సంబందించిన కెవికె, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకుంటూ అధిక వర్షాలకు రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా తోడ్పడాలని కోరారు.

పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు

సోమల: మండలంలో తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతుల పొలాల వద్దకు వెళ్లి మండలస్థాయి అధికారులు పరిశీలించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌లు ఆవులపల్లి, నంజంపేట రెవెన్యూ గ్రామాలలో పర్యటించి తుపాను కారణంగా పంటనష్టం జరిగిన రైతులతో మాట్లాడి వివరాలను సేకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


పార్థసారధి, అధ్యక్షులు


సర్దార్, ప్రధాన కార్యదర్శి


సురేష్, కార్యదర్శి


శేఖర్, గౌరవాధ్యక్షులు


రిహానా బేగం, సహాధ్యక్షురాలు

ప్రజాశక్తి-యాదమరి: యాదమరి మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జెడ్పి ఉన్నత పాఠశాలలో గౌరవ అధ్యక్షులు వైఆర్ కృష్ణయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ధనంజయరాజు సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎంఎన్ శేఖర్, అధ్యక్షులుగా కె.పార్థసారధి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్.రమేష్, అసోసియేట్ మహిళ అధ్యక్షులుగా లతారాసి, ప్రధాన కార్యదర్శిగా డి.సర్దార్, కోశాధికారిగా గిరిబాబు, ఆంగ్నైజింగ్ ప్రెసిడెంట్‌గా సుబ్రమణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులుగా చిట్టిబాబు, మండల కార్యదర్శిగా ఏ.మూర్తి, జిల్లా కౌన్సిలర్‌గా ఎం.సురేష్‌కుమార్, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా జయశ్రీ, సీపీఎస్ కన్వీనర్‌గా హేమసుందరరెడ్డి, మహిళా కమిటీ సభ్యులుగా జహ్రిన్, గౌరవ సలహాదారులుగా హణ్ముగం, మల్లికార్జున, శివాజీ, గణేశన్‌ను ఎన్నుకున్నారు. చిత్తూరులో జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ ఎన్నికల్లో యాదమరి మండలం నుంచి జిల్లా సహాధ్యక్షురాలుగా రెహనా బేగం, జిల్లా కార్యదర్శిగా పంటపల్లి సురేష్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తూ అవినీతికి వ్యతిరేకంగా రాజీ లేని పోరాటం చేస్తామని తెలిపారు.

యూటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా గాలి సురేష్


గాలి సురేష్

ప్రజాశక్తి-కుప్పం: చిత్తూరు జిల్లా యూటిఎఫ్ కార్యదర్శిగా కుప్పం పట్టణ సామగుట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు గాలి సురేష్ ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తూరులో జరిగిన యూటీఎఫ్ సమావేశంలో గాలి సురేష్ మూడవ సారి జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం అభినందించదగ్గ విషయం అన్నారు. అనంతరం కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మూడవసారి జిల్లా కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని, అలాగే తోటి సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకోవడానికి తన వంతు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

తుపాను దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏఓ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తుపాన్ దృష్ట్యా రైతులు పంటల కాపాడేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి గీతాకుమారి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్న రాగి, వరి, ఇతర పంటలకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పొలాల్లో నిలుస్తున్న నీటిని బయటకు వెళ్లాలే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు తగిన సూచనలు ఇస్తారన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టాన్ని నిలిపేయాలి

- న్యాయవాదుల సంఘం



ప్రజాశక్తి-కుప్పం: ఏపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చట్టాన్ని అమలులోనికి తీసుకురావడం బాధాకరమంటూ కుప్పం న్యాయవాదుల సంఘం నిరసన కార్యక్రమాన్ని న్యాయస్థాన ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఇంతవరకు రాష్ట్ర పరిధిలోని రైతులు తమకు సంబంధించిన భూముల సమస్యలను సివిల్ కోర్టు నందు పరిష్కారం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని తీసివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆక్ట్ 27 ఆఫ్ 2023 చట్టాన్ని అమలులోనికి తేవడం జరిగిందన్నారు. ప్రభుత్వం చట్టాన్ని చేసే పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదని, కనీసం న్యాయ నిపుణుల సలహాలు తీసుకోలేదని ఆరోపించారు. నూతన చట్టం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా భూముల సమస్యలు ఏర్పడిన వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించాలని తెలిపారు. ట్రిబ్యునల్ నందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభ్యులకు పూర్తి న్యాయ అవగాహన ఉండే అవకాశం లేదన్నారు. అంతేకాక రాజకీయ ఒత్తుళ్లకు లోబడి పని చేసే అధికారులు న్యాయపరమైన అంశాలలో సామాన్య ప్రజలకు ఎంతవరకు న్యాయం అందించగలరో ఆలోచించాలని తెలిపారు. ఈ చట్టం ద్వారా సామాన్యుల భూములు రాజకీయ కబంధహస్తాలలో చిక్కుకునే ప్రమాదం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటివి ఏర్పడ్డప్పుడు సామాన్యులు ట్రిబ్యునల్ ను ఆశ్రయించిన సంఘంలో పలుకుబడి ఉన్న వ్యక్తులకు, రాజకీయ నాయకులకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి, నూతనంగా తీసుకువచ్చిన చట్టాన్ని వెనక్కు తీసుకుని, ప్రజాభిప్రాయ సేకరణ గావించి, న్యాయ నిపుణులను సంప్రదించి నూతన చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కుప్పం న్యాయవాదులు హరికృష్ణ, మధుసూదన్, నాగరాజు, ఉదయ్ కుమార్, శ్రీకాంత్, చంద్రప్ప, శ్రీకాంత్, సురేష్, మురుగేష్, సామాజిక కార్యకర్తలు నరేంద్ర ఆజాద్, దళిత నాయకులు కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు మండల అధ్యక్షుడు అక్కిసాని భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో అభిమానులు సోమవారం గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చారు, కేక్ కట్ చేసి అభిమానులకు పంచు పెట్టారు. జన్మదిన పురస్కరించుకుని పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పికేయం ముడా చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు రెడ్డి, శేఖర్ రెడ్డి, సర్ప ంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

15న సదుంలో రైతుభేరి..

- మీడియా సమావేశంలో బీసీవై పార్టీ అధినేత



ప్రజాశక్తి-పుంగనూరు: ఈ నెల 15న సదుం మండల కేంద్రంలో రైతు భేరీ పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీసీవై పార్టీ అధినేత రామచంద్రాయాదవ్ తెలిపారు. ఈ సభలో నియోజకవర్గంలోని రైతులు అందరూ పాల్గొని జరుగుతున్న అన్యాయాన్ని, రామచంద్రారెడ్డి చేస్తున్న దోపిడీని అరికట్టడానికి ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇదే విధంగా రైతు భేరీ కార్యక్రమంలో గత ఏడాది ఇదే రోజు (డిసెంబర్ 4న) తలపెట్టినప్పుడు మంత్రి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులు చేసిన ఆరాచకం గురించి నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు చూశారన్నారు. కచ్చితంగా రైతుల సమస్యలపై పోరాటం చేయడంలో, యువత కోసం చేస్తున్న పోరాటంలో తప్పుడు కేసులకు వెనుకడుగు వేసే ప్రసక్తిలేదని తెలిపారు.

టీడీపీ రూరల్ అధ్యక్షులుగా మాధవరెడ్డి



ప్రజాశక్తి-పుంగనూరు: టీడీపీ పుంగనూరు రూరల్ అధ్యక్షులుగా గంగసాని మాధవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చల్లా రామచంద్రారెడ్డి అధ్యక్షతన సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళం గ్రామపంచాయతీకి చెందిన గంగసాని మాధవరెడ్డిని మండల పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆ తరువాత ఆయనను కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సివిరెడ్డి, ఆసురి బాలాజి, పోలీసు గిరి, సుహెల్ బాషా, రెడ్డెప్పయాదవ్, మోహన్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

- వన భోజన మహోత్సవంలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-యాదమరి: దేశ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలని కె.గొల్లపల్లి హెచ్‌ఎం లలిత అన్నారు. సోమవారం మండలంలోని కె.గొల్లపల్లి పాఠశాల ఆవరణంలో వన భోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణి, జి.భారతి, నీలవేణి, అరుణ, ఉష, భారతి, సబిత, మంజులత, మంజుశ్రీ, రాజరాజేశ్వరి, అక్తర్, కనకాచారి, మదన్‌మోహన్, భాస్కర రెడ్డి, నరసింహారెడ్డి, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యం

- జనసేన నేత యుగంధర్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ పొన్నా యుగంధర్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లా డా రు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబులు రాష్ట్ర భవిష్యత్ కోసమే ఒక్కటైయ్యారని చెప్పారు. అనంతరం తుపాను విష యంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అప్ర మత్త ంగా ఉం డాలని అత్యవసర సహాక చర్యలు అవస రమైన ప్పుడు జ నసైనికులు సిద్ధంగా ఉన్నారని ఈ సంద ర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు శోభ న్‌బాబు, లతీష్, యతీశ్వర్‌రెడ్డి, రాఘవ, నరేష్, తులసి కుమార్, సె ల్వి, రాజేష్, వెంకటాద్రి, పురుషోత్తం, మురళి పాల్గొన్నారు.

గృహసారధి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కాశిరాళ్లకు చెందిన గృహసారధి అశోక్ అనార్యోగంతో మృతి చెందారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి సోమవారం అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యక్తిగత సాయంగా అతని కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వ పరంగా సహాయాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, ఉపాధ్యక్షులు హరినారాయణరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, కాశిరాళ్ల ఎంపీటీసీ దుర్వాసులు, సర్పంచ్ రాధామురళి, నాయకులు సురేంద ర్‌రెడ్డి, రేవంత్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రామకుప్పం: ఆడుదాం ఆంధ్రా క్రీడలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రామకుప్పం ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15వరకు అవకాశం ఉందన్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎంపిక చేసుకొని బహుమతులు ఇస్తారని తెలిపారు. కాగా ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-సదుం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లు సర్పంచ్ వరలక్ష్మీ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మగారిపల్లెలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి రమేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఎంఈవో శ్రీరాములు, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లెయిమ్స్ పట్ల జాగ్రత్త వహించండి

ప్రజాశక్తి-సదుం: ఓటర్ల నమోదు, కరెక్షన్స్ పట్ల బి.ఎల్.ఓలు జాగ్రత్త వహించి, ఓటర్ల జాబితాను తయారు చేయాలని తహశీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం స్పెషల్ ఆఫీసర్‌తో కలిసి 188,189,190,191 పోలింగ్ స్టేషన్స్‌ను తనిఖీ చేశారు.

ఎంపీపీ రాక కోసం అధికారుల నిరీక్షణ

- ఎంతకీ రాకపోవడంతో వైస్ ఎంపీపీ అధ్యక్షతన మండల మీట్
- పలు అంశాలపై చర్చ



ప్రజాశక్తి-శాంతిపురం: మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ వసుంధర గైర్హాజరైయ్యారు. అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ముందుగా ఎంపీపీ కోసం అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు ఎదురుచూశారు. ఎంతకీ రాకపోవడంతో ఎంపీడీవో హేమమాలిని వైస్ ఎంపీపీ అధ్యక్షతన పట్టాభి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 10గంటలకు ప్రారంభించాల్సిన సమావేశం 11గంటలకు పైబడి మొదలైంది. గత సమావేశంలో కేవలం ప్రజాప్రతినిధులు మాత్రమే ఉండి మిగిలిన వారు సమావేశం నుంచి వెళ్లాలని ఎంపీడీవో అనడంతో పెద్ద రబస చోటుచేసుకొంది. అప్పటి నుంచి ఎంపీపీ కార్యాలయానికి దూరంగా ఉంటున్నారని, అందుకే సమావేశానికి రాలేదని పలువురు చర్చించుకున్నారు. అయితే సోమవారం జరిగిన సమావేశానికి ఎంపీపీ అనారోగ్య కారణాల వల్ల హాజరుకాలేదని ఎంపీడీవో సభలో చెప్పారు. ఆ తరువాత ప్రారంభమైన సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటికి సంబంధించి ఆయా శాఖ అధికారులు సమాదానం ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు శ్రీనివాసులు, వడ్డెర సంఘం స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, సింగల్ విండో అధ్యక్షులు మునిరత్నం, కోఆప్షన్ సభ్యుడు నిసార్, స్థానిక సర్పంచ్ ఏవి జయరాం, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే జగనన్న క్యాంటీన్

☛ ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి



మొబైల్ క్యాంటీన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పేదల ఆకలి తీర్చేందుకే జగనన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూరు కలెక్టర్ వద్ద మొబైల్ క్యాంటీన్ ను ఏర్పాటు చేశారు. క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా డిప్యూటి సీఎం నారాయణస్వామి హాజరై ప్రారంభించారు. నిరుపేదలకు అన్నదానం చేయడానికి విజయానందరెడ్డి ప్రవేశపెట్టిన క్యాంటీన్ సౌకర్యం చాలా గొప్పకార్యక్రమమని డిప్యూటి సీఎం కొనియాడారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు 500 మందికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్, మంగళవారం కోర్టు ఆవరణం, బుధవారం పాత బస్టాండ్, గురువారం గాంధీ సర్కిల్ శుక్రవారం మసీదుల వద్ద, శనివారం పీసీఆర్ సర్కిల్ ఆదివారం క్రిస్టియన్ వద్ద జగనన్న క్యాంటీన్ మొబైల్ వాహనం ద్వారా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు.

ప్రతి పల్లెకూ త్రీపేస్ విద్యుత్ లైన్

- విద్యుత్ ఏఈ



ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలోని ప్రతి గ్రామానికి త్రీఫేస్ కరెంట్ లైన్ ఇవ్వనున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ ధనుంజయ్ తెలిపారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మండల కార్యాలయంలో జరిగింది. ఏఈ మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి గ్రామానికి సింగల్ ఫేస్ లైన్ ఉన్నచోట త్రీఫేస్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అవసరమైన పోల్స్ లైన్స్ మారుస్తున్నట్లు తెలిపారు. బోడెవారిపల్లి, నేతిగుట్లపల్లి పంచాయతీలలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వడం జరిగిందని విద్యుత్ పోల్స్ కూడా అక్కడ దించారని అయితే వాటిని సిద్ధం చేయలేదని అలాగే వదిలివేయడం జరిగిందని కో ఆప్షన్ సభ్యులు బావాజాన్, నేతిగుట్లపల్లి సర్పంచి సురేందర్‌రెడ్డి ఏఈనీ ప్రశ్నించారు. దీనిపై మాట్లాడుతూ కాంట్రాక్ట్ పరిధి మించడంతో పనులు నిలిపివేశారని త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. రైతులు పండిస్తున్న వాణిజ్య పంటలకు నత్తలు వస్తున్నాయని వాటి నివారణకు చర్యలు తెలపాలని ఎంపీటీసీ సభ్యులు నాగభూషణ్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులు అడిగారు. ఈ విషయంపై ఏవో మాట్లాడుతూ సంఘటనను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో 9500 జాబ్ కార్డులు ఉన్నాయని వీటిలో 7765 మంది పని చేస్తున్నారని ఒక రోజుకి రూ.252 కూలి గిట్టుబాటు అవుతుంది తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, తహశీల్దార్ సీతారాం, చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఈశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి

- డిప్యూటి సీఎం నారాయణస్వామి


పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటి సీఎం, జేసీ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చారని డిప్యూటి సీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలిసి భూ పట్టాలను పంపిణీ చేశారు. డిపూటీ సీఎం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ.2.50లక్షల వరకు లబ్ధి పొందారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డికి ఓట్లు వేసి అండగా ఉండాలని కోరారు. ఈ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలు, నేతలు సైతం సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి చేకూరినప్పటికి ఏం చేయలేదని చెప్పి విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలంలో 255ఎకరాల భూమిని 238 మందికి, కార్వేటినగరం మండలంలో 155ఎకరాల భూమిని 132మందికి, వెదురుకుప్పం మండలంలో 71ఎకరాల భూమిని 74 మందికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పాలసముద్రం, పెనుమూరు, శ్రీరంగరాజుపురం మండలాల్లో భూ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపిపి అనిత, జడ్పీటీసీ లక్ష్మి ప్రియ, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, రాష్ట్ర గ్రీన్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, తహశీల్దార్ ఇన్బనాధన్, ఇన్చార్జి ఎంపీడీవో సుధాకర్ పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి లబ్ధిదారునికీ సంక్షేమం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అర్హత గల ప్రతి లబ్ధిదారునికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కీరమంద సచివాలయంలో సర్పంచ్ రాజా ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నారె సోమశేఖర్, సచివాలయ కన్వీనర్లు సాంబశివ, క్రిష్ణయ్య, సుధాకర్, త్యాగరాజులు, కిషోర్ కుమార్‌రెడ్డి, చాన్‌బాషా, త్యాగరాజులు, చిన్నబ్బ, సోమశేఖర్, మునిరత్నం, బజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

'ప్రేమ పెళ్లి చేసుకున్నాం.. రక్షణ కల్పించండి'



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కులాంతర వివాహం చేసుకున్నాము, తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ప్రేమజంట సోమవారం విలేకరులను ఆశ్రయించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం వెంకటరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన నందిని, అదే మండలం వేపేరి గ్రామానికి చెందిన సాయికుమార్‌లు తమకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీకి విన్నవించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారిద్దరూ మేజర్లు అని, తమ ఇష్టపూర్వకంగా గత నెల పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. ఇంట్లో పెద్దవాళ్లకు భయపడి ఇన్ని రోజులు దూరంగా ఉన్నామని, కులాంతర వివాహం చేసుకోవడం వలన తమ పెద్దల నుంచి తమకు హాని కలిగే ప్రమాదం ఉందని కనుక తమకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీని కోరారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఆభరణాలు, ద్విచక్రవాహనాలు స్వాధీనం
- మీడియాకు వివరాలు వెల్లడించిన సీఐ



ప్రజాశక్తి-కార్వేటినగరం: అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేసి ఆభరణాలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు కార్వేటినగరం సీఐ సత్యాబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని పాలసముద్రం మండలం బలిజకండ్రిగ గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. సోమవారం ఉదయం బలిజ కండ్రిగ క్రాసు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్రవాహనాలను ఆపేందుకు ప్రయత్నించగా పోలీసులను చూరి పరారయ్యేందుకు ప్రత్నించగా తమ సిబ్బంది చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని విచారించగా తమిళనాడులోని రాణిపేట జట్టేరి కాలనీ చెందిన ఎస్.పొన్మని, తిరవళూరు జిల్లా వీసీ ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన ఎం.కిషోర్, అదే గ్రామానికి చెందిన ఆర్.కార్తీక్ తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన ఆనంద్‌గా గుర్తించామన్నారు. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లో అనేక చోట్ల చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. బలిజ కండ్రిగ గ్రామంలో చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు సీఐ పేర్కొన్నారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మూడు ల్యాప్‌ట్యాప్‌లు, మోనిటర్, 18.7గ్రాముల బంగారు చైను, ఉంగరం, కమ్మలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వాటి విలువ సుమారు రూ.2.40లక్షలు ఉంటుందన్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందికి రివార్డులు అందించి, అభినందించారు. దర్యాప్తులో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- కారు స్వాధీనం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చిత్తూరు రూరల్ ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు మండలంలోని బంగారుపాళ్యం గాజులపల్లి రహదారిలో సదకుప్ప క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు. పోలీసులు చూసి కారు ఆపకుండా వెళ్లిపోవడంతో కారుని వెంబడించి అదుపులోకి తీసుకున్నామన్నారు. పరిశీలించగా అందులో కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించి కారు, మద్యం స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. పట్టుబడిన సదకుప్పం గ్రామానికి చెందిన డ్రైవర్ జ్యోతీశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీరామ్, మోహన్ బాబు, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యంగౌడ్, కిరణ్‌కుమార్, వెంకటేష్, మమత, చంద్రకళ, మోహన్, సరస్వతి, నాగరాజ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల పట్ల అలసత్వం తగదు

- ఎంపీడీవో నాగరాజు


బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో నాగరాజు

ప్రజాశక్తి-ఐరాల: దివ్యాంగుల పట్ల తల్లిదండ్రులు అతసత్వం వహించకూడదని ఎంపీడీవో నాగరాజ అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో ఋషేంద్రబాబు; దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎంపీ డీవో నాగరాజ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల తల్లిద ండ్రులు అలసత్వం చూపకుండా, భవిత కేంద్రంలో చేర్చాలని దివ్యాంగులు ఎంతోమంది ఉన్నత చదువులు చదివి, ఉన్నతాధికారులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంఈఓలు రుసేంద్రబాబు, దామోద ర్‌నాయుడు మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదని, డబ్బు కోసమో, ఆస్తి కోసం మేనరికపు వివాహాలు చేసుకోవడం వల్ల దివ్యాంగులుగా పిల్లలు పుడుతున్నారని, దీనిపై అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అంగవైకల్యం ఉందని పిల్లలను ఇంటిలోనే పెట్టుకోకుండా భవిత కేంద్రాలలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం పిల్లల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని, వారికి మంచి పోషక ఆహారాలు అందించి, తెలివి వంతులుగా తీర్చిదిద్దే విధంగా భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నా రు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, స్వీటు ్ల, బిస్కెట్లు అందజేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం ప్రతాప్‌రెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ఎంపీటీసీ మమతాసురేంద్ర, ఉపాధ్యా యులు కవిత, సురేష్, దివ్యాంగులు తల్లిదండ్రులు, ఎం.ఆర్.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు పంపిణీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా ఎంపీపీ చేతుల మీదగా రూ.56804 విలువ చేసే వీల్ చైర్, మంచం పరుపు, వికలాంగుల వ్యాయామం కోసం కొన్ని వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, ఎంఈఓ సాయిలీల, ఎంఈఓ2 సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను చిన్నచూపు చూడరాదని ఎంఈఓ2 రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని భవిత భవనంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమం ఐఆర్‌టి ఉపాధ్యాయులు హిమబిందువు ఆధ్వర్యంలో జరిగింది. ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి విద్యతో పాటు ఆటపాటలను నేర్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిందని దీనిని ప్రతి ఉపయోగించుకుంటున్నారని ఇందులో విద్యనభ్యసించినవారు డిగ్రీ పూర్తి చేశారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేంద్ర, అమూల్య, సిఆర్‌పి సుశీల, ఐఆర్టి సిబ్బంది మీరయ్య, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వపరంగా ప్రత్యేక వసతులు

- ఎంఈవో త్యాగరాజురెడ్డి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకి ప్రభుత్వపరంగా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు తవణంపల్లి ఎంఈవో త్యాగరాజురెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత భవనంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమం సహిత విద్య ఉపాధ్యాయులు దేవేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఎంఈఓ త్యాగరాజు రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం నుండి అనేక రాయితీలు కల్పిస్తున్నారని వీరిని తక్కువ అంచనా వేరాదని వీరిలో ఏదో ఒక విద్యలో నైపుణ్యత ఉంటుందని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంజిని, ఉపాధ్యాయులు విజయకృష్ణారెడ్డి, దేవరాజురెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టుగా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్టుగా భావన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవితా కేంద్రంలోని ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన మేర ఫిజియోథెరపీ వైద్యం చేయడం కోసం ప్రభుత్వం నియమించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శివరత్నమ్మ పాల్గొన్నారు.